# అ జం తా

—కె. నాగలక్ష్మి

"రేణూ ! ఒక్కమాట."

వినిపించుకోకుండా ముందుకు నడిచింది రేణుక.

"రేణూ! ఏయ్! నిన్నే" మళ్ళీ వినిపించింది శ్రీకాంత్ కేక.

"వెళ్ళవమ్మా వదినా! మీ ఆయన చెవికోసిన మేకలా అరుస్తున్నాడు" మోచేత్తో పొడిచింది నర్మద.

"అబ్బబ్బ! ఎక్కడకొచ్చినా ఈయన ధోరణి ఇంతేకదా!" విసుక్కుంటూ వెనుదిరిగింది రేణుక.

"అలా పిలుస్తుంటే వినిపించుకోకుండా పోతావేం? నే నెంత ఆత్రంగా పిలిచానో తెలుసా?" అలసిపోయిన వాడిలా రేణుకభుజం ఆసరాతో నిలబడ్డాడు శ్రీకాంత్.

"చాల్లెండి మీ సరసాలు. నలుగురితో వచ్చాంకదా! కాస్త బుద్ధి ఉండక్కర్లా? మీ చెల్లి ఏమనుకుంటుంది?"

"ప్లీజ్...ఆపు రేణూ. రేణూ! నాకు ఆ నీతిబోధలు ఇప్పుడు తలకెక్కవు. ఈ అజంతా సుందరిని చూస్తోంటే, ఈ గుహల్లో మళ్ళీ ఇలా తిరుగుతోంటే, రెండేళ్ళక్రిందటి నా అనుభవాల్తో మనసు పులకిస్తోంది. నా సంతోషం నీతో పంచుకోవాలని పిల్చాను రేణూ!"

"నిరభ్యంతరంగా పంచుకోండి, నలుగురితోబాటు మనమూ నడుద్దాం. మనమిలా వేరయి పోతే నర్మద ఏమనుకుంటుంది? తన మొహం చూడాలంటే సిగ్గేస్తుంది బాబూ!"

"ఎంత ఆడబిడ్డయినా అర్ధమొగుడే కదా! నే నిక్కడ ఉండగానే అలా భయపడతా వెందుకు? చెల్లి ఏమీ అనుకోదుగానీ, రా రేణూ! అలా వ్యూ పాయింట్ దాకా ఎక్కి, అందరికీ దూరంగా ఆ కొండమీద కూర్చుందాం."

"మరి ఈ గుహలు చూడద్దా? నాకు మళ్ళా చూడాలనే ఉందండీ..."

"ఇక ఆ గుహల్లో శిల్పమేగానీ చిత్రలేఖనం లేదు రేణూ! ఆ శిల్పంకూడా అసంపూర్ణం. చూసిందేగా ఒక్కమాటు. ఇల్లా రా రేణూ! ఈ అడవులు – అవీ ఏం ఊసులాడుకుంటున్నాయో విందాం!" అయిష్టంగానే శ్రీకాంత్ వెంట నడిచింది రేణుక.

...........  ...

"ఏయ్ నర్మదా! చూడు. మీ అన్నయ్యా వదినా ఇవన్నీ చూడటం మానేసి ఎటో పోతున్నారు" పదహేడో గుహలోంచి ఇవతలికి వస్తూ దూరంగాపోతున్న శ్రీకాంత్ రేణుకలని చూపిస్తూ అంది కల్యాణి

"పోతేపోనీ. వాళ్ళతో మనకెందుకు? గడిచిన కాలం నెమరేసుకుందుకు వెళ్ళి ఉంటారు."

"అంటే? ... ఈ గుహలు చూడరా ఇంతదూరం వచ్చి?" ఆశ్చర్యంగా అడిగింది కల్యాణి.

"అదికాదులేవే. నీకు అసలు విషయం తెలియదు. మా అన్నయ్యా వదినా రెండేళ్ళక్రితం ఇక్కడే తొలిసారిగా కలుసుకున్నారు. ఆ కలయిక ప్రణయంగా మారి పరిణయానికి దారితీసింది. అందుకే అన్నయ్యకు ఇదంటే ప్రేమ."

"ఆహాఁ. అయితే మీ అన్నయ్యది ప్రేమ వివాహమా?"

"రాత్రంతా రామాయణం విని తెల్లారి 'రాముడికి సీతేం కావాలి?' అన్నాట్ట వెనుకటికి నీలాటివాళ్ళే ఎవరో "

"సర్లే పద. నీతో ఈ అనవసరపు వాదోపవాదాలేల? గైడుగారు జోరుగా ముందుకు సాగిపోతున్నారు. కాస్త వెనకపడ్డామంటే మళ్ళీ అదంతా సరిగ్గా అర్థం చేసుకోలేం. పదపద" తొందరపెట్టింది కల్యాణి.

"అబ్బ! వీళ్ళింత అందంగా, ఇంత చక్కగా ఎలా వేశారో బొమ్మలు. ఈ రోజుల్లో మనవాళ్ళు వేసేవి ఈ మాత్రం ఉండవు."

"అసలీ రంగుల్లో కొన్ని ఎంత వింతగాఉన్నాయి చూడు. వీటిని ఎలా తయారుచేశారో, అవి ఇన్ని రోజులు వెలిసిపోకుండా ఎలా నిలిచాయో అన్న విషయం ఊహకి అందటం లేదుసుమా!"

"అబ్బా! ఈ గుహలన్నీ చూడటం అయ్యాక నా మెడ వంగదనుకుంటానే. ఇప్పుడే పట్టేసింది."

"ఇదేనే మనం సాధించిన ప్రగతి. అవి చూట్టానికే మనకి మెడ పట్టేస్తోంది. ఇక అవి ఎలా వేశారన్నది మన ఊహ కెలా తడుతుందే?"

"చూడు. ఒకదానికంటే ఒకటి ఎంత చీకటిగా ఉన్నాయో ఈ గుహలు. ఇంత చీకట్లో ఈ మారుమూలల్లో ఎలా చిత్రించారో మరి. ఇవన్నీ చూస్తోంటే ఇండియా గొప్పదే సుమా!" అనిపిస్తోంది.

"ఈ వోఘీరానది చూడవే. ఎంత అందంగా ఉందో! మధ్యమధ్య ఆ పాచిపట్టిన రాళ్ళు చూడు - చక్కగా ఉన్నాయి కదూ! తరిచి చూస్తే కాని అది రాయి అని తెలియటంలేదు."

"సంఘారామాలన్నీ నదీతీరాల్లోనే నిర్మించుకున్నారు. నిత్యావసరాల్లో గాలి తర్వాత నీరేకదా! దాని కోసం ఎక్కడికో పోవటం ఎందుకు? ఎంతో తెలివైన వాళ్లు కదా మన పూర్వీకులు!

"ఎత్తైన ఆ కొండలు, పల్లాన ప్రవహించే ఓఘీరా నది-రెండూ కన్పించేలా నన్నో ఫోటో తియ్యవే నర్మదా!"

"అబ్బ! ఎంత అపురూపమైన కోరికే తల్లీ! రెండిటిమధ్యా నువ్వో నలుసులాపడతావు. చాలామరి?"

"చాలు చాలు. నేనీ అందమైన ప్రకృతిలో నలుసు నయినా చాలు-పచ్చగడ్డి పరకనయినా చాలు."

"సొంతకవిత్వం చెప్తున్నావా లేక ఎవరిదైనా..."

"అంత ఖర్మేం పట్టింది? రెండు తెలుగుముక్కలు తప్పుల్లేకుండా చెప్పలేనా? కృష్ణశాస్త్రిగారిలా 'ఆకులో ఆకునై పూవులో పూవునై' అంటూ పాటలు రాయలేక పోవచ్చుగానీ..."

"అరే! అప్పుడే అయిపోయిందా అజంతా చూట్టం!" ఆశ్చర్యంగా వెనక్కి తిరిగి గుహలకేసి చూసింది నర్మద.

"ఇవన్నీ చూశాక వెనక్కి వెళ్ళాలంటే మనసు బాధగా ఉంది" అన్నారెవరో బస్సెక్కుతూ.

"అందుకే మనం వెనక్కి వెళ్ళటంలేదు. ప్రస్తుతానికి ఔరంగాబాద్ వెళ్ళబోతున్నాం" అన్నాడు శ్రీకాంత్.

"అవునవును శ్రీకాంత్! ఇందాకట్నుంచీ నువ్వూ, నీ సతీమణీ ఎక్కడ మాయమైపోయారు? కనిపించనే లేదే?" నీరజ్ అడిగాడు. శ్రీకాంత్ కొలీగ్ అతను.

ప్రశ్నవింటూనే ఓరకంట రేణుక కేసి చూశాడు శ్రీకాంత్. మొగిలి రేకుల్లాంటి రేణుక చెంపల్లో ముద్ద మందారాలు విరిశాయి. చిన్నగా నవ్వింది.

చిలిపిగా "అలా అడుగుతావేరా బ్రదర్. నీలాంటి బ్రహ్మచారులకి ఎక్కడేనా అజంతా సుందరి దొరకు తుందేమోనని వెదకటానికి పోయాం." అన్నాడు శ్రీకాంత్.

"నిజమే! శ్రీకాంత్‌కి వన సుందరి దొరికింది ఇక్కడేగా!" కొంటెగా అన్నాడతను. అంతా పెద్దగా నవ్వారు.

రేణుక సిగ్గుపడి పోయింది. ఈ మాటలు విననట్టు పోయి బస్సెక్కి కూర్చుంది. అందరూ ఏవో పూసలు, గాజులు కొనుక్కుంటున్నారు. నర్మద ఏవో రకరకాల గొలుసులు బేరం చేస్తోంది. ఏమీ చూడాలనిపించలేదు రేణుకకి. మనసు తియ తియ్యని గతాన్ని నెమరు వేస్తోంది. సీటుకి జారగిల బడి కళ్ళు మూసుకుంది రేణుక.

..................

"ఈ కన్నుల్లో ఇంకా పరిపూర్ణత రాలేదు. ఎలా గబ్బా ఇది పూర్తిచేయ్యటం? మెదలు పెట్టానే ఊరుకోక?" ఎల్లోరా కైలాసనాథ దేవాలయపు ధ్వజ స్థంభం దగ్గర నిలబడి ఎదురుగా ఉన్న స్త్రీ మూర్తిని చిత్రిస్తూ ఆలోచిస్తోంది రేణుక. తలెత్తి ఓ మారు శిల్పం వైపు చూస్తోంది. మరోమారు తనుగీసిన బొమ్మకు మెరుగులు దిద్దుతోంది. సహాధ్యాయినులంతా లెక్చరర్లతో కలిసి గుహలోపలింకా చూస్తున్నారు. 'కాంటీన్ దగ్గర భోజనాలు చేస్తుంటాం రమ్మని చెప్పి' కదిలారు కొందరు. "అలాగే" అంటూ అక్కడే నిలబడి పోయింది రేణుక.

"చివరికి సాధించగలిగేను. ఆ కనుగోయి కాంతి నా బొమ్మలో దించగలిగేను. ఆ పెదవుల మీది చిరు దరహాసం దీంట్లో స్పష్టంగా కన్పిస్తోంది. ముమ్మూర్తులా ఆ శిల్పం లాగేఉంది. అమ్మయ్య! అనుకున్నట్లు గీయకలిగేను." అప్పుడే పూర్తి చేసిన బొమ్మని తృప్తిగా చూసుకుంటూ సంతోషంగా కదిలింది.

ఎంతసేపట్నుంచీ రేణుకని తిలకిస్తున్నారో ఏమో ఐదారుగురు అబ్బాయిలు, సమీపంలోనే నిలబడి ఉన్నారు. వారిని చూసి కలవర పడింది రేణుక. అంతలోనే కాయితాలు సర్దుకుని బయటకు నడిచింది.

"బొమ్మకంటే, బొమ్మగీసిన కొమ్మ ఇంకా అందంగా ఉందికదరా బ్రదర్!" వెనుకనుంచీ విని పించాయా మాటలు.

"బొమ్మను చూసో-మరి కొమ్మను చూసో గానీ, మనవాడికి కమ్మని కవిత్వం వస్తోందిరా బ్రదర్!"

అంతదాకా నెమ్మదిగా నడుస్తున్న రేణుక ఒక్కసారి ఉలిక్కిపడి దాదాపు బయటికి పరుగెత్తి పోయింది. మిగతా వాళ్ళను చేరుకునే దాకా ఆమెలో కలవరం పోలేదు.

భోజనాలైనాక మిగిలిన గుహలు చూడటానికి లేచారందరూ. "ఎల్లోరాలో శైవ మతమే ఎక్కువ పోషింప బడింది కదండీ మేడమ్?" దగ్గరగా నడుస్తున్న లెక్చరర్ ఇంద్రాణి నడిగింది రేణుక.

"ఇక్కడ బౌద్ధ, జైన, శైవ మతాలు మూడు ఉన్నాయి."

"మూడు మతాల వాళ్ళూ పోటీలు పడి చెక్కారేమో!"

"అవును. అందుకే అజంతా శిల్పం కంటే ఇక్కడి శిల్పం బావుంది."

"కానీ చాలా రెపిటీషను ఉందండీ. మార్కండేయుడు, వామనుడు, శివపార్వతుల కల్యాణం, ఇత్యాది బొమ్మలు దాదాపు అన్ని గుహల్లోనూ ఉన్నాయండి. అదికాస్త విసుగ్గా వుంది."

"అవే కాక ఇంకా ఎన్నో ఉన్నాయి కదమ్మా! అన్నట్లు ఈ విషయం గమనించారా? వీటిలో శైవ గుహలకీ, బౌద్ధ, జైన గుహలకీ శిల్పంలో ఎంత తేడా ఉందో!"

"అవును మేడమ్. శైవ గుహల్లో స్థంభం కూడా చక్కగా అలంకరింపబడి ఉంది. మిగతా వాటిల్లో అదిలేదు." ఇంకా ఏదో చెప్పబోతుండగా ఒకమ్మాయి పిలిచింది.

"ఇలా రండి అంతా! ఈ శిల్పం చూశారా! ఎంత తమాషాగా ఉందో! ఒక చెట్టుకే మామిడి కాయలు, పనసకాయలు ఉన్నాయి. దాని క్రింద ఈ స్త్రీ మూర్తి. ఏమిటో దీని అర్థం?"

"మీకు తెలుసా మేడం?" వెంటనే అడిగింది రేణుక.

"లేదమ్మా! నాకేమీ అర్థం కావటం లేదు."

"నేనొకచోట చదివానండీ దీనిగురించి. మన జీవితాలు ఫలాల్లా పైకి రుచిగా ఉంటాయిట! కానీ లోపల విషపూరితమైన జీడి ఉంటుందట! అంటే మన మనసన్నమాట, అది కూడా పూర్తిగా స్వచ్ఛంగా ఉంటేగానీ మనకు మోక్షమన్నది లేదట."

"మన్నించాలి. మధ్యలో అడుగుతున్నందుకు. మామిడి కాయలకయితే జీడి ఉంటుంది. కానీ పనస కాయ గింజలు కూడా రుచిగా ఉంటాయే? అవి తింటాం కూడాను మరి మీరు చెప్పిన వివరణ దీనికి చాలదను కుంటాను." చొరవగా అమ్మాయిల గుంపు లోకి జొరబడుతూ అడిగాడు శ్రీకాంత్.

"ఇదేమిటి దేవుడా ఈ పీడ! నేనెక్కడ ఉంటే అక్కడ ప్రత్యక్షమవుతున్నారేమిటి వీళ్లు?" అను కుంటూనే జవాబిచ్చింది రేణుక.

"మీకు కలిగిన అనుమానమే నాకూ కలిగింది. కానీ ఆ విషయమేమిటో, ఈ శిల్పం చూసేదాకా అర్థం కాలేదు. ఇప్పుడు చూశాను కాబట్టి, దానికి సరైన వివరణకోసం ఏదైనా పుస్తకాలు చదువుతాను. వీలయితే ఆ రచయితకి రాసి కనుక్కుంటాను. మీ సందేహం తీర్చలేనందుకు విచారిస్తున్నాను."

రేణుకా వాళ్ళగుంపు కదిలిపోగానే ఆలోచనలో పడ్డాడు శ్రీకాంత్. ఈ అమ్మాయిని అజంతాలోనే చూశాను. చూస్తూన్నకొద్దీ తనలో ఆకర్షణ ఇలా పెరిగి పోతూందేమిటి? ఏ వూరివాళ్లో, ఏ కాలేజీ విద్యార్థి నులో కనుక్కోవాలి. వీలయితే తర్వాత ప్రయత్నాలు చేసుకోవచ్చు ననుకుంటూ.

... ... ... ... ... ...

"చూడమ్మా రేణూ! ఇతని పేరు శ్రీకాంత్ అట. నిన్ను మొన్నీమధ్య అజంతా వెళ్లేవే అక్కడ చూశా డట, నువ్వు చాలా నచ్చావనీ, నీకు ఏ విధమైన అభ్యంతరమూ లేకపోతే వివాహం చేసుకుంటాననీ ఉత్తరం రాశాడు. మరి నువ్వు ఇతన్ని చూశావా అక్కడ?" ఫొటో కూతురి చేతిలో పెడుతూ అడిగారు శ్రీనివాసరావు గారు. అందుకుంటూ ఆత్రంగా చూసింది రేణుక. ఆమె చెవుల్లో గింగురు మంది ఓ కంఠం.

"బొమ్మ కంటే బొమ్మ గీసిన కొమ్మ ఇంకా బావుం దిరా...!"

"చూశాను నాన్నా!" లోపలికి కదలబోయింది.

"వీళ్ళదీ మనదీ ఒకటే శాఖమ్మా. ఎక్కడో దూరాన కలిసే బంధుత్వం కూడా వుంది. వాళ్ళ స్థితి గతులవీ కనుక్కున్నాను. ఒకమ్మాయి, ఒకబ్బా యీను, ఇతనే పెద్దవాడు. ఏమంత ఎక్కువ బాధ్య తలు లేని కుటుంబం. అతని తల్లి అన్నపూర్ణమ్మ కూడా చాలా సౌమ్యురాలని విన్నాను." చెపుతూ కొద్ది సేపు మౌనంగా ఆగిపోయారాయన.

రేణుక ముఖంలో విరిసిన సంతోషం, చిరునవ్వుతో విచ్చుకున్న పెదవులు, బుగ్గల్లో మెరిసిన కెంపులు ఆయన్ని ఇక మాట్లాడనియ్యలేదు. "నీకు అంగీ కారమేనా తల్లీ?" అని అడగవలసిన అవసరం లేదను కున్నారు. ఏకంగా "పై నెల్లో ముహూర్తాలు పెట్టి స్తాను తల్లీ!" అన్నారు.

"అలాగే నాన్నా? మీ యిష్టం!" అంటూ ఫొటోతో సహా లోపలికి పారి పోయింది రేణుక.

... ... ... ... ... ...

"చూడు రేణూ! తాజ్‌మహల్ చెల్లెలైన ఈ బీబీ కా మఖిబారా చూడు."

"ఇప్పుడు చూడమంటున్నారే! ఇక్కడేవీ గత స్మృతులు మనసుని పులకరింప చేయటం లేదా?" చిలిపిగా అడిగింది

"లేదు రేణూ! నేను ఇది మొదటిసారి ఇప్పుడే చూస్తున్నాను. ఇంతక్రితం వచ్చినప్పుడు నా మనసెవ రికో ఇచ్చేసివచ్చా. ప్రేయసి తలపుతో నిండి పోయిన

గుండె దడదడ లాడుతోంటే కళ్ళు మూసుకొని బస్సులో పడుకున్నాను."

"అలాగా! పోనీ పాపం చూడండి ఇప్పుడయినా." అంటూ అందర్నీ దాటి-అలా ముందుకి చీకట్లోకి నడిచి-శ్రీకాంత్ భుజం మీద వాలింది రేణుక. "ఏమండీ...నేను...నేను చచ్చిపోతే నాకూ ఇలాంటిది కట్టిస్తారా మరి మీరు?"

"పిచ్చి రేణూ!" రేణుకని పెనవేసుకున్న చేతులు బిగుసుకున్నాయి. "ఇలాంటిదేం ఖర్మ? ఇంకా గొప్పది-ఎవరికీ కనిపించని హృదయ మందిరంలో కట్టిస్తాను. నా దేవిని అందులో ప్రతిష్ఠించి రోజూ పూజిస్తాను."

"ఆఁ. నాకేం అక్కర్లేదు అది. ఇలాటి పాలరాయి తోనే కట్టించండి. పెద్దగా, అందరికీ కనపడేటట్లు."

"చచ్చామే. అయితే పెద్దచిక్కే వచ్చింది నీతోటి. అయినా ఇదేం కోరిక? ఇలా మగాళ్ళందరూ వాళ్ళ వాళ్ళ భార్యలకి కట్టిస్తూ పోతే........."

"తాజ్‌మహల్ తన ప్రత్యేకతని కోల్పోతుంది. అంటారు ఔనా?" శ్రీకాంత్ మధ్యలో వదిలేసిన మాటలందుకొని పూర్తి చేసింది రేణుక.

... ... ... ... ... ...

"నర్మదా! నీకు నీరజ్ నచ్చాడా?" స్కూలు నుంచి ఇంటికి రాగానే సూటిగా అడిగేసింది తల్లి అన్నపూర్ణమ్మ.

నుదురు చిట్లించి ఏమిటన్నట్లు చూసింది నర్మద.

"అమ్మా!" అసహనంగా పిల్చాడు శ్రీకాంత్. "దాన్ని అలా అడగద్దని చెప్పలేదూ! నాకు నచ్చాడు కాబట్టి తీసుకొచ్చానంతే. దానికింత వరకు ఈ కబురు కూడా తెలియదు.

"అదికాదురా! మన కులంకాదు, మతం కాదు, మన భాష అసలేకాదు. ఎక్కడో బెంగాలీ వాణ్ణి నమ్మి పెళ్లిచేసి దీన్ని కలకత్తా ఎలా పంపేదిరా?"

"ఎలాగేమిటి? లక్షణంగా మొగుడి వెంట. అమ్మా కుల మే దయితేనేం-వాళ్లు శాఖాహారులు. ఇది చాలదా?"

"ఏమో నాయనా! మీ అభిప్రాయాలు మీవి. నాకేం అర్థమవుతాయి?"

"అమ్మా! నువ్వు కోపగించుకోకు. అతని అండని చెల్లి సుఖపడుతుందని ....... ..."

శ్రీకాంత్ మాట పూర్తికాక ముందే లోపలికి వెళ్లింది అన్నపూర్ణమ్మ.

"నువ్వు కాఫీలో పంచదార బాగా తక్కువ వేసు కుంటావు కదూ నర్మదా! నేను ఎక్కువ వేశేశానా?" చేతులు కడుక్కుంటూ అడిగింది రేణుక.

"లేదు వదినా! అదిసరేగానీ, అమ్మ ఏమిటి అంటోంది?"

"నేనేమీ వినలేదే?" ఆశ్చర్యం నటించింది రేణుక.

"నీరజ్ ఎక్కడకి పోయాడు వదినా? ఇవ్వాళ మనని సినిమాకు తీసుకెళ్ళాలి కదూ! మర్చి పోయాడా?"

"టికట్లు తీసుకు రావటానికే వెళ్ళాడు గానీ నర్మదా! దీనికి ముందు సమాధానం చెప్పు. నీరజ్‌ని నీకు వరుడిగా నిర్ణయించేను నేను. అమ్మనీ నాన్ననీ ఒప్పించి నట్లే. ఇక మిగిలింది నీ అంగీకారం. ఏమంటావ్?" వంటిట్లోకే వచ్చాడు శ్రీకాంత్.

"అన్నయ్యా!!" విస్మయంగా తలెత్తింది నర్మద.

"నిజమే నర్మదా! ఇది ముందు చెప్తే ఏదో స్వాతంత్ర్యం కోల్పోయినట్ట ఫీలయి మీరు సరిగ్గా మాట్లాడు కోరని చెప్పలేదు. ఏమంటావు?"

"అనేందుకే ముందీ? పెద్దలు మీ అందరికీ నచ్చితే నాకేమీ అభ్యంతరం లేదు.

"అదేమిటి చెల్లాయ్. అలా అంటావు? నీ కిష్టం లేకపోతే బలవంత మేమీ లేదు. నిర్మొహమాటంగా చెప్పు?"

"లేదన్నయ్యా నా కిష్టమే. మీ ఇష్టమే నా ఇష్టం."

''అలా నువ్వు సరి పెట్టుక చూడకమ్మా! నీకు మనస్ఫూర్తిగా నచ్చితేనే ఏదయినా జరిగేది.''

''అరే! చెప్పాను కదా వదినా! నిజం చెప్పాలంటే నేనే ఈ విషయం అడుగుదామా అని ఆలోచిస్తున్నాను. ఎలా చెప్పాలో...ఎప్పుడు చెప్పాలో తెలియక...''

''శ్రీకాంత్! టికట్స్ తెచ్చాను. పదండి పోదాం. కాస్సేపు అలా అలా తిరిగి, తాజ్‌లో భోజనం చేసి, సినిమా చూసి ఇంటికొద్దాం.'' హడావుడిగా ప్రవేశించాడు నీరజ్.

''మాదేం లేదు. మేం రెడీ. ఇక ఆలస్యమంతా మీ ఆవిడదే...'' చెల్లెల్ని ఉడికించాడు శ్రీకాంత్.

నీరజ్ సంతోషంగా నర్మదా వైపు చూశాడు.

అన్నయ్య మాటలకే సిగ్గుపడిన నర్మద, నీరజ్ కూడా తనవైపు చూడటంతో లోపలికి పరుగెట్టింది.

... ... ... ... ...

నర్మదా చేతి మృదుత్వం పరిశీలిస్తూ ''నేను అదృష్ట వంతుడిని నర్మదా!'' అన్నాడు. నీరజ్ నర్మద చెవి దగ్గరగా.

అతని స్పర్శతోటే ఏదోలా ఫీలవుతున్నా నర్మద- అతను దగ్గరగా వచ్చి మాట్లాడ్డంతో ఉక్కిరి బిక్కిరైంది.

''ఊహుఁ, నేనే అదృష్టవంతురాల్ని. తీయని ఊహగా మిగిలి పోతుందనుకొన్న కోరిక- అనుకోని విధంగా తీరింది. నిజం నేనే, అదృష్టవంతురాల్ని.'' అని చెప్పాలనుకొంది. కానీ, ఆ సంతోషంలో ఏమీ చెప్పలేక ముగ్ధలా కూర్చుండి పోయింది.

—o—

"ఇట పల్లవుల రాచ యెలనాగ లేఁత్రవత
మ్ములు చేసిరో లచ్చి నిలుకడవడె,
ఈ కాశ్యపీఖండమే శరజ్జ్యోత్స్నలో
పులకించెనో, కీర్తి తెలుపు లూరె"

—విశ్వనాథ.